# గుండు . డాట్‌కామ్

అబ్బాయిలు, అమ్మాయిలు బోల్డు డబ్బుపోసి ఇంజనీరింగ్, డాక్టర్ చదువులు చదువుకోవడం.., చివరకు ఇంకా పైకి చదువుకోవాలని అమెరికా వెళ్లిపోవడం.., అక్కడ పైచదువులు చదువుకుంటూనే ఉన్నతోద్యోగాలు సంపాదించి, లక్షలకొద్దీ జీతంతో అక్కడే ఉండిపోవడం.., అలా కాకపోతే ఇంజనీరో, డాక్టరో అయిపోగానే 'దుబాయ్, కటార్, అబుదాబి' లాంటి దేశాలకు 'వలస' పోవడం... ఇలా అయిపోయింది- నేటితరం యువతీయువకుల జీవనవిధానం.

కొన్నేళ్ల క్రితం ఐదోక్లాసు చదువుకుంటున్న పిల్లాడిని గాని, పిల్లదాన్ని గాని పలకరిస్తే... 'నేను పెద్ద చదువులు చదివి అమెరికా వెళ్లిపోతాను' అనేవారు.

ఏమిటో... చదువులు పూర్తయ్యేవరకే! ఆ తరువాత పిల్లలు మన ఎదురుగా ఉండడం లేదు. విదేశాలకు వెళ్లిపోవడం.., ఇక్కడ స్వదేశంలో తాతగాని, మామ్మగాని మరెవరైనా చనిపోతే- బూడిదైపోయాకగాని రాలేకపోవడం.., ఫోటోకి దండ వేసి, ఏడ్చి ఊరుకోవడం పరిపాటి అయిపోయింది. ఏమిటో... అసలు మానవ సంబంధాలు పూర్తిగా నశించి పోయాయి. కాలం ఎటుపోతోందో..?!

ఆంధ్రదేశంలోని మా మారుమూల గ్రామంలో కనీసం అరవైమంది యువతీ యువకులు అమెరికాలో మంచి పొజిషన్స్‌లో వుండి డాలర్లు పంపిస్తున్నారు. గ్రామంలో వారు చేసే మంచి కార్యక్రమాలపై టీ.వీ.లో స్పెషల్ ప్రోగ్రాం కూడా వచ్చింది.

సంధ్య వార్చుకుని వచ్చి, వాకిట్లో పడకకుర్చీలో కూర్చుని పేపరు చూస్తున్నాను.

"తాతగారూ..." అంటూ అమెరికా నుంచి వచ్చిన మా మునిమనవడు నా దగ్గరికి వచ్చాడు. ఎఱ్ఱగా యాపిల్ పండులా వున్నాడు ముద్దుగా. అమెరికాలోనే ఒక చల్లని ప్రదేశంలో పుట్టి పెరిగాడు మరి!

అమెరికాలో 'కత్తెర. డాట్‌కామ్' అనే కోట్లకు పడగలెత్తిన సంస్థలో పనిచేస్తున్న మా మనవడు వచ్చాడు- నన్ను చూసేందుకు. వాడి కొడుకే వీడు!

"ఇదేంటి తాతగారూ..?" అన్నాడు నా భుజంపై వేలాడుతున్న జంధ్యాన్ని పట్టుకుని లాగుతూ.

"లాగకమ్మా... తెగిపోతుంది! దీన్ని 'గాయత్రి' లేక 'యజ్ఞోపవీతం' అంటారు. దణ్ణం పెట్టుకో!"

"అదేంటీ... మా నాన్నగారు అప్పుడప్పుడు ఈ తాడు వీపు గోక్కోడానికి బలే పనికివస్తుందంటారు తాతగారూ!" అన్నాడు మునిమనవడు.

ఏం చెప్పాలో అర్థంకాలేదు.

ఇంతలో... ఎదురింటాయన వచ్చారు. వస్తూనే- "ఇది విన్నారా? మీ అబ్బాయి, మా అబ్బాయి, మరో పదిమంది కలిసి స్వంతంగా 'గుండు. డాట్‌కామ్' అనే సంస్థ పెట్టారుట!" అన్నాడు. ఆయన ఖద్దరు బనీను, పంచెకట్టు మీద వున్నారు. వారి ఇద్దరు అబ్బాయిలు అమెరికాలోనే వున్నారు.

"నా బొంద! 'గుండు. డాట్‌కామ్' ఏమిటండీ..?"

"అంటే... గత పదేళ్లుగా అమెరికాకు అన్ని దేశాల నుండి ఇంజనీర్, డాక్టర్ ఉద్యోగాల కోసం జనం విపరీతంగా వెళ్లిపోవడం వలన, వాటి ఖాళీలు తగ్గిపోయి, ఇప్పుడు హెయిర్ కటింగ్, బట్టలుతకడం, ఇళ్లల్లో పనిచేసే దుబాసీలు లాంటి పోస్టులకు గిరాకీ పెరిగిందట!"

"అయితే..?!" చిరాకుగా ముఖంపెట్టాను నేను.

"ఏం లేదు. మనం చేత్తో చేసేదేమీ ఉండదండీ బాబూ! క్రాఫ్ చేయాలన్నా మిషన్లు వుంటాయి. ఆ మిషన్లతో మనోళ్ళు కంప్యూటర్స్‌తో పనిచేయించడమే!"

"ఏదిఏమైనా... జుట్టు కత్తిరించడమే కదా!"

"అవుననుకోండీ... దీనికి కారణం ఎవరు? మనమే! మీకు గుర్తుందో, లేదో... ఇప్పటి బి.టెక్.ని మన చిన్నప్పుడు బి.ఇ. అనేవారు. బి.ఇ. చదివినోళ్ళు ఎక్కువైపోయి వాళ్ళకు ఉద్యోగాలు లేకుండాపోయాయి. అందుకని బి.ఇ. చదివినోడికి పిల్లనిచ్చేవారు కాదు. దీనికంతటికీ మనమే కారణం కదుటండీ?!" అన్నారాయన.

"మీరు చెప్పేది నిజమే కాని- మన ఊళ్లో సెలూన్‌లో చేసే పనీ, బట్టలుతికి ఇస్త్రీ చేసే పనీ అలాటివే కదండీ!"

"భలేవారే! నే చెప్తా వినండి..."

"ఎలాగ?"

"ఆ దేశంలో చాలామందికి గుండు చేయించుకోవడం ఫ్యాషన్ అనుకుందాం- ఉదాహరణకి చెప్తున్నా సుమండీ! 'గుండు' అంటే మనదేశంలో లాగ చలిమిడి ముద్దలాగా నున్నగా గుండు గీసేయరు... ఆ గుండు మీద వాళ్ళ ప్రేయసి పేరో, లేకపోతే ఇష్టమైన క్రికెట్ ప్లేయరు పేరో డిజైన్ చేసి జుట్టు అంటకత్తిరిస్తారు.

అప్పుడేమో వాడి తలకాయని మిషన్‌లో పెట్టి, బిగించి, వాడు అడిగిన డిజైన్‌ని కంప్యూటర్‌లో ఫీడ్ చేసి, మిషన్ ఆన్ చేస్తారు. అంతే... వాడు కోరుకున్నవారి పేరు 'రీటా' అనుకోండి, అంతే... వాడి తలమీద 'రీటా' అన్న పేరుతో అంటకత్తెర గుండు క్షణంలో తయారైపోతుంది. ఇందులో మనం చేసేదేముంది?"

"ఓహోఁ... అలాగా!" అయినా నా మనసు అంగీకరించడం లేదు. ఇబ్బందిగా మొహం పెట్టాను.

"ఓహోఁ... అలాగా' అంటారేమిటి? మీ మనవడు 'కత్తెర. డాట్‌కామ్'లో పనిచేయడం లేదూ..."

"చాల్లెండి... అది దీనికి సంబంధించి కాదండీ బాబూ! ఏ సైజుకా సైజు డాక్యుమెంట్ కట్ చేస్తుందట!" అని నేను ఆయనకు సర్దిచెబుతుండగానే- లోపల్నుంచి మా మనవడు రానే వచ్చాడు. వస్తూనే -

"కాదు తాతగారూ! 'కత్తెర. డాట్‌కామ్'లో ప్రపంచంలో ఎన్ని రకాల హెయిర్‌స్టైల్స్ ఉన్నాయో అన్నీ కంప్యూటర్స్‌లో ఫీడ్ చేసి వుంటాయి. అదేకాకుండా మరో పదేళ్లలో ఎలాంటి ఫ్యాషన్స్ వస్తాయో అవన్నీ పరిశోధన చేయడానికి కొంతమంది ఇంజనీర్లు అదే పనిగా ఆలోచిస్తూనే వుంటారు... ఎన్నో సరికొత్త డిజైన్ల గురించి!"

నేను మనవడి మాటలకు అడ్డు వచ్చి-

"అయితే... నీదీ 'గుండు. డాట్‌కామ్' లాంటిదేనా?" అని అడిగాను.

"అవును తాతగారూ! 'కత్తెర. డాట్‌కామ్' వాడికి పలుకుబడి ఎక్కువై లేటెస్ట్ హెయిర్‌స్టైల్స్‌తో మనల్ని డామినేట్ చేసేస్తున్నాడు. వాడి పొగరణచడానికి నాన్నగారు, మరికొందరు కలిసి 'గుండు. డాట్‌కామ్' స్థాపించారు. నేనూ అందులోకి వెళ్లిపోతాను."

"అయితే... మీరు చేసేదేమిట్రా?"

"మేము మనిషి తలను మిషన్‌లో పెడతాం. అతనికి ఏ హెయిర్‌స్టైల్ కావాలో అడుగుతాం. అతను చెప్పాక కంప్యూటర్‌లో ఆ హెయిర్‌స్టైల్ డిజైన్ చేసి, మిషన్‌కి కనెక్ట్ చేసి కంప్యూటర్‌లో బటన్ నొక్కుతాం. అంతే... క్షణంలో ఆ హెయిర్‌స్టైల్ అయిపోతుంది. అంతే!"

"దీనికెంత తీసుకుంటారేం..?"

"ఎంత... వంద డాలర్ల నుండి ఫ్యాషన్‌ని బట్టి రెండు వందల డాలర్ల వరకు ఛార్జి అవుతుంది!"

"అంటే... ఏభై వేలా?"

"అవును తాతగారూ!"

'ఏమిటో... ప్రారబ్దం! మూడు సంధ్యలూ వార్చిస్తే గాని నాకు పొద్దుపొడవదు, 'మడీ, మశానం' అంటూ మీ మామ్మేమో నిప్పులు కడుక్కుంటుంది. అలాంటి కుటుంబం నుంచి 'గుండు, డాట్‌కామ్', 'కత్తెర. డాట్‌కామ్'లు పుట్టాయి. ఏంటో నా ఖర్మ!' అనుకోసాగాను.

"తాతగారూ! 'త్రిసంధ్యలు' అంటే... రోజుకు మూడుసార్లు సన్‌సెట్ అయ్యేదా? నిప్పులు కడుక్కోవడమేమిటి?" అన్నాడు నా మనవడు.

"అరేయ్ఁ... సూర్యుడు ఉదయించే ముందు, మధ్యాహ్నం నడినెత్తి మీద వున్నప్పుడు, అస్తమించే ముందు... ఇలాగ మూడు సంధ్యల్లోనూ సంధ్యవార్చి గాయత్రీ జపం చేసుకుంటాను. ఇది మన ఆచారం.

అలాగే మీ మామ్మ కుంపట్లో బొగ్గులతో వంట చేస్తుంది కదా! వంట అయిపోయాక బొగ్గులో అన్నం, గంజి పడుతుందనీ అది 'అంటు' అనిచెప్పి ఆ నిప్పులు ఆర్పేసి, నీళ్లతో బొగ్గులన్నీ శుభ్రంగా కడుక్కుంటుంది. అంత మడీ, ఆచారం మనుకున్నాయి మరి! మీరు చూస్తే ఈ కటింగ్ కార్యక్రమం పెట్టుకుంటిరి!"

"తాతగారూ... మనం ఎప్పుడూ పాత కస్టమ్స్‌ని పట్టుకుని వేలాడకూడదు. మేం త్వరలో 'వాషింగ్. డాట్‌కామ్' ప్రారంభించే ఆలోచనలో వున్నాం."

"బట్టలు కూడా ఉతుకుతారా ఏమిటి... కొంపదీసి? అప్రాచ్యపు పనులు చేస్తున్నారా?" అన్నాన్నేను.

"అదికాదు తాతగారూ! మనం చదువుకున్న ఇంజనీరింగ్ తెలివితేటలతో ఈ కార్యక్రమాలన్నీ చేస్తున్నామన్నమాట!" తెలివిగా వివరించాడు.

"మరి, బట్టలు ఎలా ఉతుకుతారురా?"

"పొడుగాటి మిషన్ వుంటుంది. ఈ చివర్న మాసిన బట్టలు వేశాం అనుకో... సూటింగ్స్, ప్యాంట్స్, షర్ట్స్, చీరలు, లంగాలు, గౌనులు, నైటీలు- ఇలాగ రకరకాలుగా వుంటాయి గదా... కంప్యూటర్‌లో వీటన్నిటి వివరాలు, మడతలు ఎలా పెట్టాలి... వగైరా వివరాలు ఫీడ్ చేస్తాం.

ఉదాహరణకి- సూట్స్ అన్నీ ఒకేసారి వేశాం అనుకో! 'సూట్' అని కంప్యూటర్స్‌లో బటన్ నొక్కి మిషన్ ఆన్ చేస్తే... సూట్స్ అన్నీ ఉతికివేయబడి, డ్రై చేయబడి, ఇస్త్రీ చేయబడి ఈ చివరకు వస్తాయి. కుర్రాళ్లను పెట్టి అవి కవర్స్‌లో పెట్టి డెలివరీ చేసేయడమే! ఎంత బాగుందో చూడండి!"

"చాల్లే తెలివితేటలు! ఇవేం వద్దు గాని, మన దేశం వచ్చేయండి. నాలుగు బిల్డింగులు కట్టుకుని పరువుగా బతకొచ్చు!" అన్నాన్నేను ఉద్రేకంగా.

"తాతగారూ... మీ కాలం అయిపోయింది. 'కృష్ణా, రామా' అని కాలక్షేపం చేయండి. మాకు పోష్ అలవాట్లు అయిపోయాయి. మాకు ఈ డబ్బు చాలదు. మేం మరి ఏ పనైనా చేయాల్సిందే. తప్పదు. అయినా తప్పేముంది తాతగారూ" అన్నాడు మనవడు.

మా ఇంటి ఎదురింటాయన కలగజేసుకుని- "నేనూ మా అబ్బాయికి చెప్పాను. త్వరగా 'క్లాత్ వాషింగ్. డాట్‌కామ్' మొదలుపెట్టేయమని! అవసరమైతే నాలుగెకరాలు పొలం అమ్మి డబ్బు పంపిస్తానని చెప్పాను. ఎకరం నలభై లక్షలు పలుకుతోందిలెండి!" అన్నారు.

"ఏమిటండీ... 'గుండు' అంటున్నారు, 'క్లాత్ వాషింగ్' అంటున్నారు?" అంటూ కలనేత చీర కట్టుకుని, చీరకొంగు తలమీద కప్పుకుని వచ్చింది మా శ్రీమతి.

"అదేనే... అమెరికాలో ఇంజనీర్లు, డాక్టర్ల ఉద్యోగాలు నిండిపోయాయిట! అందుకని, గుండులు చెయ్యడం, క్రాఫులు చెయ్యడం, బట్టలు ఉతకడం మొదలైన పనులకు గిరాకీ పెరిగింది. అందుకని అలాంటి మిషన్లు కనిపెట్టి వాటితో వ్యాపారం చేస్తున్నారట మన దేశం నుండి వెళ్లినవాళ్ళు..."

నా మాటలకు అడ్డువచ్చి-

"చాల్లెండి చోద్యం! చిన్నప్పుడు మన పెద్దాడు క్రాఫు చేయించుకోడానికి వెళ్లివచ్చాక- వీధిగుమ్మం దగ్గరే బట్టలిప్పించి, తడిపించి, పసుపు నీళ్లు చల్లి, ఆ తర్వాత స్నానం చేశాక, శుద్ధి చేసిగాని వాడిని ఇంట్లోకి రానిచ్చేదాన్ని కాదు. వేసిన వెర్రివేషాలు చాలు గాని, ఆ ఉద్యోగాలు మానేసి వచ్చేయమనండి!" అందామె చిరాకుగా.

వెంటనే మనవడు కలగచేసుకుని "కాదు మామ్మా! అక్కడ మనలాగా అసహ్యంగా చూడరు. చాలా క్లాసు. నువ్వు బల్బ పాడుచేసుకోకు!" అన్నాడు.

వెంటనే నా శ్రీమతి కలగచేసుకుని-

"అబ్బాయ్! మీరందరూ ఇకనుండి మనదేశంలో విమానం దిగగానే లాడ్జింగ్‌లో బట్టలన్నీ పారేసి, మన దేశంలో కొత్తబట్టలు కొనుక్కుని వేసుకుని రండి. ఆ అప్రాచ్యపు పనులు చేసి, ఆ మైలబట్టలతో మన ఇంటికి వచ్చి మమ్మల్ని అప్రతిష్ఠ పాలు చెయ్యకండి..." అంటూ మూతి ముప్పయ్ వంకర్లు తిప్పుతూ, శరీరం అష్టవంకర్లు తిప్పుకుంటూ ఇంట్లోకి వెళ్లిపోయింది.

వెంటనే మనవడు "తాతా... అసలు విషయం ఇంకోటి వుంది! ఈ ఉద్యోగాలు కూడా అయిపోతే ఇళ్లల్లో పనిచేసే దుబాసీ ఉద్యోగాలు చేయాల్సివస్తుంది. దానికన్నా ఇది నయం కదా! అయినా తాతా... వాళ్ళు మనలాగా తుప్పలుతుప్పలుగా బోల్డు జుట్టు పెంచుకోరు. అలాగే రోజుకో సూటు విప్పేస్తారు. మరీ అసహ్యంగా వుండరు. మాసినబట్టలు, మాసినట్లుగా వుండవు..." అంటున్నాడు నన్ను మానసికంగా తయారుచెయ్యడానికి.

ఏదిఏమైనా... నాలో మానసిక సంఘర్షణ మొదలైంది. "ఒరేయ్ఁ... నువ్వు వీడిని నీతో తీసుకెళ్లకు. వీడిని వేద పాఠశాలలో చేరుస్తాను. వేదాలు నేర్చుకుని మన ప్రాచీన సాంప్రదాయాలు కాపాడుతాడు" అన్నాను.

"నేనూ వెళ్లిపోతాను" అంటున్నాడు మునిమనుమడు.

"వెధవాయ్ఁ..." అంటూ చెయ్యెత్తి వాడిని కొట్టాను.

అంతే...

"ఇదేం మేళం? ఏం కల వచ్చిందీ... నా చెంప పగలకొట్టారు?!" అంటూ లేచింది నా శ్రీమతి.

కళ్ళు తెరిస్తే పక్కలో నా శ్రీమతి ఆందోళనగా నావైపు చూస్తోంది. నా బుఱ్ఱ తిరిగిపోయింది. ఉదయమే చదివిన వార్త 'అమెరికాలో కొన్ని సంవత్సరాలలో మిగిలే ఉద్యోగాలు' కత్తిరింపులే నాకు పీడకలగా వచ్చింది.

నా కుటుంబంలో ఇకనుండి ఎవర్నీ విదేశాలకు వెళ్లనివ్వకూడదని నిర్ణయించుకున్నాను.

అయినా... వాళ్ళు నా మాట వింటారా?

●

'స్వాతి' వారపత్రిక ... 21 డిసెంబర్' 2007 సంచికలో ప్రచురితం